
ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024
5
పార్వతీపురం మన్యం



నేటి నుంచి అంగన్వాడీలకు ఒంటిపూట

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలను గురువారం నుంచి ఒంటిపూట నిర్వహించనున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు వీలుగా ఉన్నతాధికారులు కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలు ఉంటాయి. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఐరన్ మందు బిళ్లలు కేంద్రాల్లో సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపట్టారు. మే ఒకటో తేదీ నుంచి 15 వరకు అంగన్వాడీ కార్యకర్తలకు, 16 నుంచి 30వ తేదీవరకు సహాయకులకు సెలవులు మంజూరు చేసినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్.లక్ష్మి తెలిపారు.



పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో నాగావళి నదిలో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించి నేటికి సరిగ్గా రెండేళ్లు కావచ్చింది. సొంత జిల్లా కావాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరినా సమస్యలు మాత్రం యథాతథంగానే ఉన్నాయి. అభివృద్ధి జాడ కూడా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే ఉంది. శాఖల వారీగా భవనాలు, గదులు, కొన్నింటికి ప్రత్యేక భవనాలు ఏర్పాటైనా 90శాతం సిబ్బంది మొదలుకుని, జిల్లా స్థాయి అధికారుల వరకు స్థానికంగా నివాసం ఉండడం లేదు. ఉమ్మడి జిల్లాతో పోలిస్తే కలెక్టరేట్ ఇతర జిల్లా శాఖ అధికారులను కలిసేందుకు దూర భారం, ఆర్థిక ప్రయాస తగ్గింది. ఏడాదిలో సాధించిన ప్రగతి అదే. ముఖ్యంగా గిరిజనులకు వ్యయ, ప్రయాస తప్పడం లేదు. ఇంతకు మించి చెప్పకోవడానికి ఏమీ కనిపించడం లేదు. ఎన్నో వనరులు ఉన్నా వాటిని వినియోగించి, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించడం, ఆ దిశగా కనీసం ప్రయత్నం చేయడం వంటి ఆనవాళ్లు కనిపించడం లేదు. ఎప్పటి మాదిరిగానే సంక్షేమ పథకాల హడావుడి తప్ప చెప్పకోదగ్గ విశేషాలేమీ లేవు.

- మాటలకే పరిమితమైన సుస్థిరాభివృద్ధి
- యథాతథంగా గిరిజనోత్పత్తుల దోపిడీ
- తప్పని సాగునీటి వెతలు
- నేడు పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావ దినోత్సవం

అభివృద్ధి ఎండమావి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి పార్వతీపురం మన్యం జిల్లాగా 2022 ఏప్రిల్ 4న ఆవిర్భవించిన విషయం విదితమే. ఇందులో మొత్తం 15 మండలాలు ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రాంతమంతా విజయనగరం జిల్లా 1979లో ఏర్పడక పూర్వం శ్రీకాకుళం జిల్లాలోదే. అభివృద్ధికి దూరంగా ఉండడం, పరిపాలన సౌలభ్యానికి దూరభారం కావడం వల్ల కొత్తగా విజయనగరం జిల్లా ఏర్పాటు చేసి అందులో కలిపారు. అపారమైన వనరులు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో, చాలా కాలం క్రితమే పార్వతీపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. వైసిపి వచ్చాక జిల్లాల పునర్విభజన చేయడంతో ఆ కల నెరవేరింది. జిల్లా అయితే ఏర్పడింది గానీ ప్రజలు, అభ్యుదయ, అభివృద్ధి కాముకులు ఆశించిన ఆశలు మాత్రం నెరవేరే పరిస్థితులు కనిపించ లేదు. జిల్లా ఆవిర్భావం సందర్భంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యమన్న పాలకులు గానీ, ఉన్నతాధికారులు గానీ అందుకనుగుణంగా కృషి చేయడం లేదు.

రాష్ట్రంలోనే అత్యంత చిన్న జిల్లా

మన్యం జిల్లా మొత్తం జనాభా 9.72 లక్షలు. అందులో ఎస్సి జనాభా 1.15 లక్షలు (11.83శాతం), ఎస్టి జనాభా 2.65 లక్షలు (27.26శాతం) రెండూ కలిపితే 3,81,418 (39.09శాతం) అవుతుంది. రాష్ట్రంలో అల్లూరి జిల్లా తరువాత గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లా ఇదే. జిల్లాలో భూ విస్తీర్ణం 3,93,514 హెక్టార్లు కాగా సాగుకు అనువైన భూమి 1,67,961 హెక్టార్లు మాత్రమే. మిగిలినదంతా కొండలు, గుట్టలే. ఇప్పటికీ గిరిజనులు పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు.

సాగునీటికి వెతలు

మైదాన ప్రాంతంలో సారవంతమైన పంట భూములు ఉన్నాయి. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే మన్యంలో వర్షపాతం ఎక్కువ. కానీ, నిల్వ చేసుకునే ప్రాజెక్టులు లేనందున వర్షం నీరు ఉపయోగ పడడం లేదు. నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజి నిర్మించినా జిల్లాకు ఉపయోగం తక్కువ. 1978లో ప్రారంభించిన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. దశాబ్దం దాటినా అడారుగెడ్డపై చిరు ప్రాజెక్టు సైతం పూర్తి చేయలేదు. ఎక్కడికక్కడ కొండల్లో మినీ రిజర్వాయర్లు నిర్మించడం ద్వారా జిల్లా సస్యశ్యామలం చేయవచ్చు. ఎన్నో చోట్ల మినీ రిజర్వాయర్లు తక్కువ ఖర్చుతో నిర్మించే అవకాశం ఉన్నా ఈ ఏడాదిలో అటువంటి ప్రయత్నం ఈ రెండేళ్లలో కనీసం చేయలేదు.

పారిశ్రామికంగా వెనుకబాటు

జిల్లాలో ఉన్న పరిశ్రమలు రెండే రెండు. అవి.. లచ్చయ్యపేట ఎన్సిఎస్ చక్కెర ఫ్యాక్టరీ, జీగిరాం జ్యూట్ మిల్లు. ప్రస్తుతం సుగర్ ఫ్యాక్టరీ మూతబడింది. ఈ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములను ప్రభుత్వమే కారు చౌకగా విక్రయించి రియల్ ఎస్టేట్గా మార్చేసింది. జూట్ మిల్లు ఒడిదొడుకుల మధ్య ఉంది. కొత్తగా పరిశ్రమలు స్థాపించడం మాట అటుంచి ఉన్నవి కూడా మూతపడడంతో ఉపాధి, ఉద్యోగాలు స్థానికంగా దొరకడం లేదు.

గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరేది?

గిరిజన ప్రాంతం జీడి, పైనాపిల్, చింత పండు, తునికాకు తదితర అటవీ ఉత్పత్తులకు ఆలవాలం. స్థానికంగా ఫుడ్ పార్కులు ఏర్పాటు చేసి, గిరిజన ఉత్పత్తులకు గిరాకి పెంచుతామని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపరుస్తామని జిల్లా ఆవిర్భావ సమయంలో అధికార యంత్రాంగం ప్రగల్భాలు పలికింది. ఆచరణలో కనీస ప్రయత్నం లేదు. దీంతో, గిరిజనులు ఓవైపు దోపిడీకి గురౌతున్నారు. మరోవైపు అత్యల్ప ఆదాయంతో మెరుగైన జీవనం సాగించలేని దుస్థితి కొనసాగుతోంది.



రోగిని డోలి కట్టి తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్)

అభివృద్ధిపై నిర్లక్ష్యం

జిల్లా అభివృద్ధిపై ఎప్పటి మాదిరిగానే నిర్లక్ష్యం కొనసాగింది. రాష్ట్రంలో ఒకేసారి 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామంటూ చెప్పుకుంటున్న పాలకులు మన్యం జిల్లాకు మాత్రం ముఖం చాటేశారు. పార్వతీపురంలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మాత్రమే మార్చారు. కురుపాంలోని ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఎంఎ, ఎం.కామ్, ఎంఎస్సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ వంటి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు జిల్లాలో లేవు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వలేదు. జిల్లా, రాష్ట్రానికి చెందిన పాలకులు ప్రశ్నించడం లేదు. మరోవైపు గిరిజన ప్రాంతాల్లో చాలా గ్రామాలకు రోడ్లు లేవు. వైద్య సేవల కోసం డోలి మోత తప్పడం లేదు. రక్షిత తాగునీటి పథకాలు లేక చెలమనీరే గత్యంతరంగా ఉన్న గిరిజన గూడలెన్నో. బడిలేని గ్రామాలూ అనేకం ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఇవేవీ అధికార యంత్రాంగానికి పెద్దగా పట్టలేదు. కేవలం నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకే పరిమితమైంది. ఇవి కూడా అందని అర్హులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక, సేవా, పర్యాటక రంగాల్లో అభివృద్ధి సమగ్ర ప్రణాళిక రూపొందించి, నిర్దిష్టమైన కాలపరిమితిలో అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.



పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు



పింఛను కోసం వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న పింఛనుదారులు

పింఛన్ల కోసం పడిగాపులు

- రెండు రోజులు ఆలస్యంగా పంపిణీ
- సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా అందజేత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండు రోజులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా బుధవారం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు అందజేశారు. అకౌంట్లకు నగదు ఆలస్యంగా పడినందున పంపిణీలో జాప్యం జరిగిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయనగరం జిల్లా కలెక్టర్ 4వ తేదీన పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్ర స్థాయిలో వచ్చిన ప్రకటన ప్రకారం 3వ తేదీనే అందుతాయని ఆశపడ్డారు. ఇదే ఆశతో ఉదయం నుంచీ వృద్ధులు, వికలాంగులు, ఒంటిరి మహిళలు ఇలా అనేక కేటగిరీలకు చెందిన పింఛను దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మండుటెండలో తీవ్ర అవస్థలు పడ్డారు. వేపాడ మండలం సింగరాయి, వల్లంపూడితోపాటు, విజయనగంలోని విటి అగ్రహారం, మెరకముడిదాం మండలం గర్భాం సహా ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో అనేక చోట్ల ఇదే పరిస్థితి ఎదురైంది. మధ్యాహ్నం వరకు సంబంధిత సచివాలయ అకౌంట్లలో నగదు జమకాలేదు. అనంతరం అకౌంట్లలో జమ అయినట్టు మెసేజ్లు రావడంతో సంబంధిత బాధ్యులు హుటాహుటిన బ్యాంకులకు వెళ్లి నగదు తెచ్చారు. అనంతరం లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుని సచివాలయ సిబ్బంది నగదు పంపిణీ చేశారు. కేవలం సచివాలయాలలోనే కాకుండా, కొన్నిచోట్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. సమయం సరిపోకపోవడంతో మిగిలిన వారికి రేపు ఇస్తామంటూ చాలా చోట్ల సిబ్బంది చెప్పారు.

విజయనగరం జిల్లాలో 2,83,773 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో అత్యధికంగా వృద్ధులు 1,47,874 మంది ఉన్నారు. ఆ తరువాత స్థానంలో వితంతువులు 65,971 మంది, వికలాంగులు 37,840మంది, వైఎస్ఆర్ అభయ హస్తం పింఛనుదారులు 10,848 మంది ఉన్నారు. మిగిలిన వారిలో కళాకారులు, చేనేత, మత్స్యకార, ట్రాన్స్ జెండర్, దీర్ఘకాలిక రోగులు ఉన్నారు. వీరందరికి నెలనెలా సుమారు రూ.82కోట్ల 93లక్షల 99వేలు జిల్లా గ్రామీణాభివృద్ధి ద్వారా సామాజిక పింఛన్ల కింద అందుతోంది. ఈ మొత్తాన్ని సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల పనుల నుంచి వాలంటీర్లను మినహాయించాలని ఎన్నికల సంఘం సూచించిన సంగతి తెలిసిందే. చివరకు న్యాయ స్థానం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున వాలంటీర్లతో పింఛన్లు పంపిణీ పట్ల టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అభ్యంతరం తెలిపిన సంగతి తెలిసిందే. దీనికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బందితో పంపిణీ చేపట్టాలని న్యాయ స్థానం సూచించింది. దీంతో, చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేయనీయకుండా అడ్డుకుంటున్నారంటూ సిఎం జగన్ సహా వైసిపి నాయకులు విమర్శలు చేశారు. అందుకు తగ్గట్టే రాష్ట్ర స్థాయి అధికారులు మునుపెన్నడూ లేని విధంగా రెండు రోజులు ఆలస్యంగా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. దీంతో, ఆ మేరకు ఆలస్యంగానే పింఛన్ల పంపిణీ మొదలైంది.

పింఛన్ల పంపిణీలో జాప్యం

పార్వతీపురం మన్యం జిల్లాలో 1,45,409 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 22,874 మందికి పింఛన్లు బుధవారం సాయంత్రానికి పంపిణీ చేశారు.

● **సాలూరు** మున్సిపాలిటీలో బుధవారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఫించన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మాత్రం బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్లు పంపిణీ చేపడుతున్నట్లు ప్రకటించింది. కానీ బ్యాంక్ నుంచి నగదు సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ కార్యదర్శులకు అందకపోవడంతో సాయంత్రం వరకు పంపిణీ కాలేదు. బుధవారం రాత్రి పది గంటల వరకైనా పింఛన్లు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. కానీ నగదు చేరడం ఆలస్యం కావడంతో సాయంత్రం పింఛన్లు పంపిణీ చేయడానికి సచివాలయాల సిబ్బంది ఇష్టపడలేదు. చీకటి పడిన తర్వాత పింఛన్లు పంపిణీ చేస్తే ఇబ్బంది పడతామని వారు భావించి పంపిణీ ప్రారంభించలేదని తెలుస్తోంది.

● **వీరఘట్టం** మేజరు పంచాయతీ సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారేమోనని పింఛనుదారులు బుధవారం ఉదయం నుండి పడిగాపులు కాశారు. సచివాలయ సిబ్బంది కార్యాలయానికి చేరుకొని ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తారని చెప్పడంతో వారంతా ఇంటి ముఖం పట్టారు. ● **పాలకొండ** మండలంలో అన్నవరంలో సచివాలయం దగ్గర పింఛనుదారులు పింఛను కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు గండి రామినాయుడు పింఛనుదారులతో మాట్లాడి, వారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందించారు.

తీరానికి చేరుకున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -భోగాపురం

విశాఖ తీరంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభ్యమయింది. వారంతా బోల్తాపడిన తెప్పపైనే ఎక్కి అప్పికొండ బీచ్ వద్దకు చేరుకోవడంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ముక్కాం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సోమవారం వేటకు వెళ్లి మంగళవారం సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో వాళ్ల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కోస్ట్ గార్డ్ పోలీసుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో బుధవారం వేకువ జామున అప్పికొండ తీరం వద్దకు ఈదుకుంటూ వారంతా చేరుకున్నారు. అక్కడ స్థానికులు వారిని చేర దీశారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ సముద్రంలో అలల తాకిడికి తెప్ప బోల్తా పడినట్లు తెలిపారు. బోల్తా పడిన తెప్పను యథాస్థితికి తెచ్చేందుకు ప్రయత్నించగా కుదరలేదని, దీంతో వలలు దాచుకునే కవర్ సహాయంతో తీరానికి చేరుకున్నట్లు వీరు తెలిపారు. వీరిని గ్రామ సర్పంచ్ భర్త వాసుపల్లి రెయ్యుడు పరామర్శించారు. ఈ సంఘటనలో ప్రాణాలతో ఒడ్డికి చేరుకున్నప్పటికీ తెప్పతో పాటు విలువైన వలలు పోయాయని తెప్ప యజమాని తెలిపారు. సుమారు 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు చెబుతున్నారు.



ప్రచారం చేస్తున్న డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

ఎన్నికల సమయంలో ప్రజల ముందుకొచ్చే మోసగాళ్లు, వేషగాళ్ల మాటలు నమ్మొద్దని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఓటర్లను కోరారు. మండలంలోని పాంచాలి గ్రామంలో రెండో రోజు బుధవారం డిప్యూటీ సిఎం రాజన్న దొర మండు టెండలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజన్నదొరకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సుపరిపాలనకే ఓటు వేయాలని గ్రామస్తులను ఆయన కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని చెప్పారు. ఐదేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని సిఎం జగన్ మోహన్ రెడ్డి అడుగుతున్నారని, దేశంలో అటువంటి దమ్ము, ధైర్యం ఉన్న ఏకైక నేత జగన్ మాత్రమేనని తెలిపారు. మళ్లీ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలంటే ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నారాయణరావు, పెద్దిబాబు, గొట్టాపు ముత్యాలనాయుడు, డోల బాబ్జి, టి.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్పి అభ్యర్థి కొత్తపల్లి గీత చుట్టూ అసమ్మతి సెగలు అలుముకుంటున్నాయి. బిజెపి నాయకత్వం ఎమ్పి అభ్యర్థిగా మాజీ ఎమ్పి కొత్తపల్లి గీతని ప్రకటించగానే ఆ పార్టీకి చెందిన గిరిజన నాయకులు అసమ్మతి తెలుపుతున్నారు. ఆ అసంతృప్తి కాస్తా రోజురోజుకూ చినికిచినికి గాలివానలా మారుతోంది. అసలే రాష్ట్రం పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న బిజెపిపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సొంత పార్టీ, కూటమి నేతలు కూడా తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తుండటంతో ముమ్ముందు ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాలోనన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

- అరకు ఎమ్పి అభ్యర్థిపై పెరుగుతున్న వ్యతిరేకత
- ఆదివాసీలకు ఇవ్వాలని డిమాండ్
- మాజీ ఎమ్మెల్యే జయరాజ్ తిరుగుబావుటా

కమలం చుట్టూ అసమ్మతి గీతం



ప్రజాశక్తి-సాలూరు

అరకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గిరిజన ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 50శాతం పైగా గిరిజన ఓటర్లు ఉన్న కారణంగా ఎస్టిలకు ఎమ్పి సీటు రిజర్వు చేశారు. ఆరు గిరిజన అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపికి ఉన్న ఓట్ల శాతమే చాలా తక్కువ. ఈ సీటుని పొత్తులో భాగంగా బిజెపికి టిడిపి కేటాయించడం ఆత్మహత్యా సదృశ్యం లాంటిదనే అభిప్రాయం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. పొత్తు ధర్మంలో భాగంగా టిడిపి త్యాగం చేసినా అభ్యర్థి ఎంపికలో బిజెపి అధిష్టానం నిజమైన గిరిజనులను పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్తోపాటు మరో గిరిజన నాయకులు కెవి సత్యనారాయణ రెడ్డి కూడా అరకు ఎమ్పి సీటు ఆశించారు. ఆదివాసీ గిరిజన సంఘాలతో సంబంధాలు కలిగిన జయరాజ్, కెవి సత్యనారాయణ రెడ్డి లాంటి నిజమైన గిరిజన నాయకులను బిజెపి పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. మాజీ ఎమ్పి కొత్తపల్లి గీత 2014 నుంచి ఎస్టి కాదనే కులవివాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఆమె ఎస్సి క్రిష్టియన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె తల్లిదండ్రుల ధ్రువపత్రాల ఆధారంగా ఎస్టి కాదని గిరిజన సంఘాలు వాదిస్తున్నాయి. ఈ ఆధారాల ప్రకారమే గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి పరిశీలక కమిటీ ఆమె ఎస్టి కాదని పేర్కొంటూ నివేదిక సమర్పించింది. కొద్దినెలల క్రితం రాష్ట్ర స్థాయి పరిశీలక కమిటీ కూడా విచారణ చేపట్టి గీత ఎస్టి కాదని నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై ఆమె హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని ప్రస్తుతం ఎస్టిగా కొనసాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

తొలి నుంచీ వ్యతిరేకత

అరకు ఎమ్పి సీటుకు అభ్యర్థిని ప్రకటించక ముందు నుంచి కొత్తపల్లి గీత పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆమె పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎక్కడికక్కడ ప్రచార హోర్డింగులు పెట్టించి బిజెపిలో తన పలుకుబడిని చాటుకున్నారు. ప్రచారం జరిగినట్లుగానే ఆమెను బిజెపి ఖరారు చేయడంతో ఆదివాసీ గిరిజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బిజెపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు కూడా గీతకు అరకు ఎమ్పి సీటు ఇవ్వొద్దని కోరుతూ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదును పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. గీతని ఎమ్పి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే జయరాజ్ తీవ్రంగా స్పందించారు. నకిలీ గిరిజన నాయకురాలు, ఆర్థిక నేరారోపణలు ఎదుర్కొంటున్న కొత్తపల్లి గీతకు ఎమ్పి సీటు ఇవ్వకుండా నిజమైన గిరిజన నాయకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడితో ఆగకుండా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై కూడా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆమె పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత ఎపిలో బిజెపి భ్రష్టుపట్టిందని ధ్వజమెత్తారు. ఆమెకు వ్యతిరేకంగా బిజెపికి చెందిన మాజీ ఎమ్మెల్యే జయరాజ్ ప్రచారం చేస్తున్నారు.

కూటమిలో విభేదాలు!

సాలూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి కూడా గతంలో కొత్తపల్లి గీత అభ్యర్థిత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. 2014లో వైసిపి అభ్యర్థి కొత్తపల్లి గీతపై టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణి పోటీ చేశారు. ఆ తర్వాత ఆమె ఎస్టి కాదని పేర్కొంటూ హైకోర్టులో కేసు వేసి ఉపసంహరించుకున్నారు. రెండు రోజుల క్రితం ఎమ్పి అభ్యర్థి కొత్తపల్లి గీత పట్టణానికి వచ్చి టిడిపి నాయకులు, కార్యకర్తలను కలిశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పి భంజ్దేవ్ నివాసంలో బిజెపి, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కానీ, ఆ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి పాల్గొనలేదు. మామిడిపల్లి సమీపంలో నిర్వహించిన టిడిపి సమావేశానికి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సమావేశానికి కొత్తపల్లి గీత, భంజ్ దేవ్ కూడా హాజరయ్యారు. ఇక్కడ సంధ్యారాణి, గీత తప్పని పరిస్థితుల్లో పలుకరించుకుని కూటమి ఐక్యత చాటుకున్నారు. ఏమైనా అరకు కూటమి అభ్యర్థి చుట్టూ అసమ్మతి సెగలు రాసుకుంటున్నాయి. ఆమెని వ్యతిరేకిస్తూ బిజెపి నాయకులే బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ముమ్ముందు ఉమ్మడి ఎమ్పి అభ్యర్థి కొత్తపల్లి గీతపై ఇంకెంతమంది నాయకులు అసమ్మతి రాగం వినిపిస్తారనేది చర్చనీయాంశమవుతోంది.



మంచిపల్లికి సిక్కోలు చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న లీలావరప్రసాదరావు

సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం మీడియా సంబంధాల విభాగం సమన్వయకర్త జి.లీలావరప్రసాదరావు రాసిన సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకాన్ని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు బుధవారం పార్వతీపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీలావరప్రసాదరావును మంచిపల్లి శ్రీరాములు అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గొర్లె తిరుపతిరావు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



వృథాగా పోతున్న నీరు

పట్టణంలో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా సమయంలో పలుచోట్ల వృథాగా పోతోంది. తాగునీరు వృథాగా పోతున్నా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు గాని, తాగునీరు సరఫరా చేసే సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదు. దీంతో మిగతా వార్డుల్లో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగా జరుగుతోంది. దీంతో మిగతా వార్డుల ప్రజలు అధికారులు, సిబ్బంది తీరుపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.



ర్యాలీ చేస్తున్న అధికారులు

ఓటు హక్కుపై చైతన్య ర్యాలీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో హడ్డుబంగి, లోవగూడ, ఈతమానుగూడ, జామితోట తదితర గ్రామాల్లో డిడి అన్నదొర ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కు వినియోగంపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. దాని ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఓటు హక్కు వజ్రాయుధమని చెప్పారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి, అడ్డుబంగి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఖడ్గవలస జంక్షన్లో మంగళవారం అర్ధరాత్రి ఎస్ఐ వె.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నగదు, మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరగకుండా తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు.

సీతంపేటలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గ్రామంలో ఎస్ఐ ఎం.జగదీశ్ నాయుడు ఆధ్వర్యాన సిబ్బంది, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని ఆయన తెలిపారు.



కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర

నర్సిపురంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం గ్రామంలో బుధవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవితో కలిసి ఆయన గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టిడిపిలో చేరగా వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలో 7028 పింఛన్ల పంపిణీకి కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. 4, 5 తేదీలలో సచివాలయ సిబ్బంది ద్వారా మొత్తం పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందిస్తామని ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ తెలిపారు.

కస్పా వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని రెండో సచివాలయ పరిధిలో కస్పావీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతకుమారి, ఎంఎల్హెచ్పి కావ్య, ఎఎన్ఎం జానకి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్టిసి బస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె. రమేష్ బుధవారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం ఏర్పాటుకు సహకరికంచిన దాత స్థానిక చిత్రాకళా స్టూడియో రాజుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతకు పాతర

రోడ్డేసిన కొద్ది రోజులకే ఊడిపోయిన బిటి రహదారి



ఊడిపోయిన బిటి రోడ్డు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో చేపట్టిన బిటి రోడ్డు పనుల్లో నాణ్యతకు పాతరేశారు. రోడ్డు వేసిన కొద్దిరోజులకే పెచ్చులూడిపోవడమే అందుకు నిదర్శనం. మండలంలో కళ్లికోట పంచాయతీ దుగ్గి నుంచి గారవలసకు ఇటీవల బిటి రహదారి వేశారు. పనుల్లో నాణ్యతా లోపం వల్ల రహదారి ముక్కలు ముక్కలుగా ఊడిపోతోంది. ఇన్నాళ్లు రోడ్డు లేదని తీవ్ర ఇబ్బందులు పడిన గిరిజనులు.. ఎట్టకేలకు వేసిన రోడ్డు ఊడిపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు మామ్మూళ్లు ముట్టడం వల్లే పనులపై పర్యవేక్షణ కొరవడిందని ఆరోపిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గారవలస గిరిజనులు కోరుతున్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



మిమ్స్ ఉద్యోగులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ నెల్లిమర్ల మిమ్స్ హాస్పిటల్ పనిచేస్తున్న ఉద్యోగులు 62 రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేదని, ప్రభుత్వానికి ఏమాత్రమూ పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులను, మహిళలను అరెస్టు చేయడం దారుణమన్నారు. 20 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసి మిమ్స్ సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన ఉద్యోగులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్లు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన డిఎను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్రెల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు తవ్వకాల్లో పైపులైను దెబ్బతిన్నది ఇక్కడే

పాచిపెంటలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట మండల కేంద్రంలో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి ఆవేదన చెందారు. రెండు రోజులుగా గ్రామానికి తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఆయన విలేకరులకు తెలియజేశారు. మండల కేంద్రంలో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టరు, అధికారులు తప్పిదమే అందుకు కారణమని ఆరోపించారు.

పాచిపెంట నుండి గురువు నాయుడుపేట వరకు నాలుగు కోట్ల రూపాయలతో బిటి రోడ్డు, సిమెంట్ రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారని, దీనంతటికీ కారణం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ లోపమేనని చెప్పారు. రోడ్డు పనుల్లో భాగంగా పైపులు విరిగిపోయాయని, పైపులకు మరమ్మతులు చేపట్టి మండల కేంద్ర వాసులకు తాగునీరు అందించాల్సిన గ్రామ పంచాయతీ కనీసం స్పందించలేదని తెలిపారు. రోడ్డును ఇష్టానుసారంగా తవ్వి వదిలేయడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల్లో చలనం లేకపోతే కలెక్టర్కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

సెక్టార్ అధికారులతో ఆర్డిఒ సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డిఒ కె.హేమలత బుధవారం తన కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోస్టల్ బ్యాలెట్పై వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం తహశీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఒ జగన్మోహనరావు

వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించి, నివేదికలు సకాలంలో అందజేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంఒ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి ప్రతి రోజూ ఆరోగ్య పరీక్షల కోసం వస్తున్న వారికి, క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సర్వేలెన్స్లో జ్వర లక్షణాలున్న వారికి సేకరించిన రక్తపూతల నమూనాలను సకాలంలో పరీక్షించి, నివేదికలు వెంటనే తెలియజేయాలన్నారు. వివరాలు ల్యాబ్ రికార్డులో ఎప్పటికప్పుడే నమోదు చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే ఐహెచ్ఐపి పోర్టల్లో ఆన్లైన్లో తప్పనిసరిగా నమోదుచేయాలని సూచించారు. తద్వారా క్షేత్ర స్థాయి సిబ్బంది ఆ ప్రదేశంలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. హెల్త్ అసిస్టెంట్స్, హెల్త్ సూపర్వైజర్ల సందర్శనల వివరాలతో నెలవారీ ప్రణాళికను (టూర్ డైరీ) కార్యాలయానికి అందించాలని చెప్పారు. ప్రాంతీయ, జిల్లా, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రిలో గానీ, పక్క జిల్లాలో గానీ మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే ఆ వివరాలు ఎంఎఫ్7 రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతి పిహెచ్సిలో ఆక్టివ్ (క్షేత్ర స్థాయిలో), పాసివ్ (ఆసుపత్రిలో) బ్లడ్ శాంపిల్స్ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఎం4, ఎంఎఫ్7, ఎంఎఫ్9 ల్యాబ్ రికార్డులను పక్కాగా నిర్వహించి, వారాంతపు, నెలవారీ నివేదికలు సకాలంలో డిఎంఒ కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేలో సేకరించిన రక్త పూతలను ల్యాబ్లో సకాలంలో పరీక్షించి, నివేదికలు తెలియజేయాలన్నారు. ఆస్పత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని, ల్యాబ్ నిర్వహణ పటిష్టంగా ఉన్నప్పుడే వ్యాధుల పట్ల ప్రజలను సకాలంలో అప్రమత్తం చేయవచ్చని కోరారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, జిల్లా వివిడి కన్సల్టెంట్ రామచంద్ర, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఇఒ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరించిన పాలకులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలుగా గెలిచినా పార్వతీపురంలో సమస్యలను గాలికి వదిలేశారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు ఆక్షేపించారు. బుధవారం పార్వతీపురం బైపాస్ రోడ్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యలే కీలకమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో దళితులకు, ముస్లిములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షమని, ప్రజా సంక్షేమ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. సామాన్యుడైన తనను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్మాన ప్రవీణ్ కుమార్, సిహెచ్ వెంకటరమణ, పి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం జరుగుతుందని ఆ పార్టీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటిబాబు అన్నారు. బుధవారం ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పేదలు, సామాన్యులకు మేలు జరిగే విధంగా మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని చెప్పారు. పాలకొండలో భూ కబ్జాలు విపరీతంగా పెరిగి పోయాయని తెలిపారు. తాగునీటి సమస్య ఉందన్నారు. పట్టణం అభివృద్ధి చెందలేదని చెప్పారు. సమావేశంలో పార్వతీపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తిని మోహన్, శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే జోగారావు ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పట్టణంలోని 2, 28వ వార్డుల్లో బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వర రావు, కౌన్సిలర్లు మజ్జి శశికర్, కోరాడ శ్రీనివాసరావు (నాని), సువ్వాడ లావణ్య, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్టేట్ డైరెక్టర్లు మజ్జి నాగమణి, వెంకటరమణ, కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, సీనియర్ నాయకులు ఎస్విఎస్ఎన్ రెడ్డి, రెడ్డి రవికుమార్, ఎస్.ప్రకాశ్, బత్తుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి

మండలంలో తుండ పంచాయతీ పరిధిలో తుండ, వడ్డీవలస, ఉల్లి చింతలవలస, చిన ఊటగెడ్డ, చెల్లూరు వలస, అప్పన్నదొరవలస గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. బుధవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో తుండ మాజీ సర్పంచులు యరగడ ధర్మ, రౌతు భాస్కరరావు, వార్డు సభ్యులు వెంకటమ్మ, చిలకమ్మ, చెల్లూరు పరయ్య, ఐతయ్య, రాము, సింహాచలం, లక్ష్మణ, తదితరులు టిడిపిలో చేరారు. అనంతరం పంచాయతీ పరిధిలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పరమేశ్, మాలతీదొర, కోట లక్ష్మణ, దొర లక్ష్మణ, శ్రీరామ్ సత్తిబాబు, అరసాడ తిరుపతి, మండంగి నందయ్య, మజ్జి తవిటయ్య పాల్గొన్నారు.

అపెరల్ పార్కు ఏదీ?

- టిడిపి హయాంలో శంకుస్థాపన
- వైసిపి ప్రభుత్వంలో ఊసే లేదు
- పార్కు స్థలంలో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-రేగిడి

రాజాం నియోజకవర్గంలోని రేగిడి మండలం గుల్లపాడు గ్రామపంచాయతీ పరిధి కొండల మామిడి వలస (ఉంగరాడమెట్ట) వద్ద అపెరల్ పార్కు (టెక్స్టైల్స్ పరిశ్రమ) ఏర్పాటుకు వేసిన శిలాఫలకం నిరుద్యోగులను ఎక్కిరిస్తోంది. అపెరల్ పార్క్ నిర్మాణం కోసం అప్పటి టిడిపికి చెందిన రాష్ట్ర విద్యుత్శాఖా మంత్రి, ప్రస్తుత స్పీకర్ తమ్మినేని సీతారాం 2000 సంవత్సరంలో శిలాఫలకం వేశారు. ఆగమేఘాలపై రెవెన్యూ అధికారులకు 10ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి నివేదికలు పంపించాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి ప్రజా ఆమోదం తీసుకున్నారు. ఇక్కడ అపెరల్ పార్క్ నిర్మాణం చేపడితే వేలమంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కలుగుతుందని అప్పటి టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంత్రి తమ్మినేని సీతారాం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని గాలికి వదిలేశారు. ప్రస్తుత వై సిపి ప్రభుత్వం ఆ పరిశ్రమ ఊసే ఎత్తలేదు. పైగాఈ స్థలాన్ని జగనన్న కాలనీకి రెవెన్యూ అధికారులు బదిలీ చేశారు. దీంతో అపెరల్ పార్కు నిర్మాణం లేక వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కరువైంది. దీంతో విశాఖ, చెన్నై, ముంబై, కోల్కత్తా, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలలో పనులు కోసం వలస వెళ్లిపోతున్నారు. ప్రభుత్వాలు మారిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.



ఇదే అపెరల్ పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలం

ఉపాధి కోసం ఎదురుచూపులు

రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాల్లో 120 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన వందలాది మంది యువకులు ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్నారు. ఇక్కడ టెక్స్టైల్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉపాధి పొందిన కుటుంబాలకు చేదోడువాదోడిగా ఉంటామను కున్న నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి అపెరల్ పార్కు నిర్మాణం కోసం నిధులు కేటాయించి నిరుద్యోగ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి లేక వలసలు

ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాక, ఉపాధి లేక వలస బాట పడుతున్నాం. ఇక్కడ అపెరల్ పార్కు నిర్మాణం



పార్కు కోసం కేటాయించిన స్థలంలో జగన్ కాలనీ నిర్మాణం

చేపడితే నిరుద్యోగ సమస్య కొంతయినా తీరుతుంది. ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

వాల్తేటి రవికుమార్, కొమిరి గ్రామం

ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు

కొండల మామిడి వలస సమీపాన ప్రభుత్వ స్థలంలో టెక్స్టైల్స్ పరిశ్రమ నిర్మాణం కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం శంకుస్థాపనచేసి 24 ఏళ్లయ్యింది. ఆ తరువాత వైసిపి అధికారం చేపట్టినప్పటికీ పట్టించుకోలేదు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులకు శ్రద్ధ లేదు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. మా గ్రామం సమీపంలో కొత్త పరిశ్రమ వస్తే చదువుకున్న తమకు ఉద్యోగవకాశాలు వస్తాయని ఆశపడ్డాం. కానీ మా ఆశ నెరవేరలేదు. వచ్చే కొత్త ప్రభుత్వమెనా అపెరల్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

చింతాడ గణేష్, రేగిడి

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని వడ్డివీధికి చెందిన ఉల్లి వినయ్ కుమార్ (35) ఇంట్లో ఫ్యాన్కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్ఐ సీతారాం చెప్పారు. ఆయన తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో గుమ్మడ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొట్టడంతో కె.సతీష్ (30) అక్కడికక్కడ మృతి చెందాడు. కురుపాం మండలం కిక్కిరి గ్రామానికి చెందిన కె.సతీష్ సీతంపేట మండలం కేసరజోడులో పని ముగించుకొని తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో కొత్తూరు వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సీతంపేట ఎస్ఐ జగదీష్ నాయుడు కేసు నమోదు చేశారు.

40 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని తోణాం గ్రామ సమీపంలో 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. అదే గ్రామానికి చెందిన సవర భగవాన్ను అరెస్టు చేసినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.